ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నంద్యాల

జిల్లా వార్తలు 5

బుధవారం 12 ఫిబ్రవరి 2025

నల్లమల కష్టాలు

- జాతీయ హోదా దక్కినా విస్తరణకు నోచుకోని కేజీ రోడ్డు
- సింగిల్ లైన్ మార్గంతో తరచూ ప్రమాదాలు
- అమరావతికి పెరిగిన రాకపోకలు
- ఇబ్బందిగా రోళ్లపెంట ఘాట్ ప్రయాణం



నల్లమల ఘాట్‌లో ట్రాఫిక్ జామ్ వల్ల నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

ఆత్మకూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వు ఫారెస్ట్‌గా పేరొందిన నల్లమల అటవీ ప్రాంతంలో రహదారి కష్టాలు వెంటాడుతున్నాయి. కర్నూలు నుంచి గుంటూరు, అమరావతి రాజధాని ప్రాంతాలకు నల్లమల మీదుగానే వెళ్లాలి. కర్నూలు-గుంటూరు(కేజీ) జాతీయ రహదారిగా గుర్తింపు ఉన్నప్పటికీ అటవీ శాఖ అవాంతరాలతో జాతీయ రహదారి కాస్తా సింగిల్‌రోడ్డుగా మిగిలింది. నల్లమల అటవీ ప్రాంతం మీదుగా కేజీ రహదారితో పాటు ఘాట్‌రోడ్డులో ఏ చిన్న ప్రమాదం జరిగినా, దారిలో ఎక్కడైనా వాహనాలు మరమ్మతులకు గురైనా వాహనాల రాకపోకలు స్తంభించిపోవాల్సిన పరిస్థితి. రాత్రివేళల్లో ఈ సంఘటనలు చోటు చేసుకుంటే రాత్రంతా అడవిలో నరకయాతనకు గురికావాల్సిందే. ఏళ్ల తరబడి ఈ సమస్య వేధిస్తున్నప్పటికీ పరిష్కారం దిశగా ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో విజయవాడను రాజధానిగా ఎంపిక చేయడంతో 2018 జనవరి 18వ తేదిన కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిని ఎన్‌హెచ్ 340సీ నంబర్ పేరిట కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారిగా మార్చేసింది. కేజీరోడ్డు నేషనల్‌హైవేగా హోదా దక్కించుకున్నప్పటికీ నల్లమల అటవీ ప్రాంతంలో సింగిల్‌లైన్ రోడ్డుగా ఉండటం వల్ల సమస్య తీరలేదు. దీనికితోడు విజయవాడను రాజధాని చేయడం వల్ల కర్నూలు జిల్లా నుంచి విజయవాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే వాహనాల సంఖ్య పెరగడంతో కేజీ రోడ్డుపై ట్రాఫిక్ మరింతగా పెరిగింది.

జాతీయ హోదా దక్కినా తప్పని కష్టాలు

కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారి జాతీయ రహదారిగా హోదా దక్కించుకోవడంతో ప్రస్తుతం కర్నూలు ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం వరకు నాలుగు లైన్ల రోడ్డు విస్తరణ పనులు చకచక సాగిపోతున్నాయి. వాస్తవానికి కర్నూలు నుంచి గుంటూరుకు రహదారి మార్గాన వెళ్లాలంటే 306.6కిమీల దూరం వెళ్లాల్సి వుంటుంది. ఇందులో కర్నూలు నుంచి దోర్నాలకు 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. ఇంతకాలం కర్నూలు నుంచి ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామశివారు వరకు కేజీరోడ్డు రెండులైన్లు ఉండగా ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కర్నూలు, ప్రకాశం జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రోళ్లపెంట ఘాట్‌లో ప్రయాణం ఇబ్బందిగా మారుతోంది. ఆత్మకూరు నుంచి సరిగ్గా 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎత్తైన కొండలపై నిర్మించిన ఘాట్‌రోడ్డును ఎక్కేందుకు భారీ, గూడ్స్ వాహనాలు మొరాయిస్తున్నాయి. ఘాట్ ఎక్కలేక అనేక మార్లు బ్రేక్ ఫెయిల్ కావడం, ఇంజన్‌లో సాంకేతిక సమస్యలు రావడం, ఘాట్ ఎక్కలేక వెనక్కి వచ్చి కొండను ఢీకొట్టడం వంటి సంఘటనలు జరిగి వాహనాలు దారికి అడ్డంగా నిలిచిపోతున్నాయి. అదేవిధంగా ఘాట్ దిగే వాహనాలు సైతం వేగంగా రావడం వల్ల రోడ్డు ఇరుగ్గా ఉండటంతో కొండను ఢీకొనడం, పక్కనే ఉన్న గుంతల్లో పడిపోవడం, బ్రెక్‌ఫెయిల్ కావడం వంటి ప్రమాదాలకు గురవుతున్నాయి.



నల్లమలలోని కేజీరోడ్డు మార్గంలో పడిపోయిన ఆయిల్ ట్యాంకర్ (ఫైల్)

బైర్లూటి నుంచి ప్రకాశం జిల్లా మంతనాల వరకు సుమారు 30 కిలోమీటర్ల దూరం పాటు అటవీ మార్గంలో ప్రయాణించాల్సి ఉంది. ఈ దారిలోనే రోళ్లపెంట ఘాట్‌తో పాటు ప్రమాదకరమైన రహదారి ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఈ రోడ్డు ఇరుగ్గా ఉండటంతో పాటు అక్కడక్కడ రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. అలాగే పలుచోట్ల రహదారికి ఇరువైపుల రక్షణ గోడలు, సూచికలు లేకపోవడంతో కేజీ రహదారి అంటేనే ప్రయాణికులు, వాహన చోదకులు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రహదారిని బాగు చేయాలని అనేక మార్లు రవాణాశాఖ అధికారులు ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచిస్తున్నారు. అయితే టైగర్ రిజర్వు ఫారెస్ట్ పరిధిలో రోడ్డు విస్తరణ చేపట్టేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోవడంతో ఆ పనులు ముందుకు సాగలేదు. దీనికి ఇటీవల అడవులకు విఘాతం కలిగించేలా ఎలాంటి పనులు చేపట్టరాదని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖలు స్పష్టం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో నల్లమలలోని కేజీ రహదారి విస్తరణకు అనుమతులు వస్తాయా..? అన్నది కూడా ప్రశ్నార్థకంగానే మిగిలింది. దీంతో కర్నూలు నుంచి గుంటూరు, కాకినాడ, చీరాల, విజయవాడ, మంగళగిరి, శ్రీశైలం, మార్కాపురం, ఒంగోల్, రాజమండ్రి, విశాఖపట్నం, మాచర్ల తదితర ప్రాంతాలకు చేరుకునే ప్రయాణికులకు నల్లమలలోని కేజీ రహదారిపై అవస్థలు తప్పడం లేదు.

చర్యలు చేపడితేనే...

కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై అక్కడక్కడ పలు ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుంది. నల్లమలలోని ప్రమాదకర ఘాట్ల వద్ద రహదారికి ఇరువైపుల రక్షణ గోడలను ఏర్పాటు చేయాలి. రోడ్డుకు ఇరువైపుల కాంక్రిట్‌తో పటిష్ట చర్యలు చేపట్టాలి. రోళ్లపెంట ఘాట్ రోడ్డులో అన్‌ఫిట్ వాహనాలను, భారీ గూడ్స్ వాహనాలను అనుమతించరాదు. ఘాట్‌రోడ్డులోని రెండో మలుపు వద్ద తప్పనిసరిగా విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఒకవేళ వాహనం ఘాట్ ఎక్కలేక నిలిచిపోయినప్పటికీ పక్కకు నెట్టేందుకు వీలుగా రోడ్డు విస్తరణ చేపట్టాలి. వీటితో పాటు నిత్యం పెట్రోలింగ్ వాహనం నల్లమల అటవీ ప్రాంతం, ఘాట్‌రోడ్డులో పర్యవేక్షణ సాగిస్తే.. ప్రమాదాలు, ట్రాఫిక్ సమయంలో సమస్యను సత్వరమే పరిష్కరించేందుకు అవకాశం వుంటుంది.



నల్లమలలోని కేజీ రోడ్డు దుస్థితి ఇలా

నంద్యాల డీవైఈఓగా శంకర్ ప్రసాద్

డోన్‌కు వెంకట్రామిరెడ్డి నియామకం



శంకర్‌ప్రసాద్



వెంకట్రామిరెడ్డి

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి(డీవైఈఓ)గా శంకర్‌ప్రసాద్, డోన్ డీవైఈఓగా వెంకట్రామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం శిరివెళ్ల, కోవెలకుంట్ల ఎంఈఓలుగా పనిచేస్తున్న వీరికి పదోన్నతి కల్పించి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్లుగా ఉన్నతాధికారులు నియమించారు.

ఓరా.. సమీరా..!



సమీరా... ఓ ట్రాన్స్ జెండర్. చిన్నతనం నుంచే అవమానాలు, చీదరింపులు సమాజం వెలివేసేలా చిన్నచూపు. వీడేంట్రా మగోడిగా పుట్టి ఇలా ప్రవర్తిస్తున్నాడంటూ అసహ్యించుకునేవారు. చివరకు తల్లిదండ్రులు సైతం సమీరాను దూరం పెట్టేశారు. అందరిలా సమీరా కుంగిపోలేదు. అనుకున్నది సాధించాలనుకుని ఇష్టమైన రంగంలో రాణించాలని భావించారు. ఏడాది పాటు అవమానాలు, కన్నీరు దిగమింగి డాన్స్ నేర్చుకున్నారు. చెక్కభజనకు కేరాఫ్‌గా నిలిచారు. ఎవరైతే విమర్శించారో వాళ్లే ఔరా సమీరా.. శభాష్ సమీరా అంటూ ప్రశంసలతో ముంచెత్తుతున్నారు. అవమానాలను భరించి అమెరికా దాకా ఆమె ప్రస్థానం సాగిన తీరు ఎంతో మందికి ఆదర్శనీయం.

వివరాలు 6లో

చెట్నహల్లి.. శ్మశాన లొల్లి..!

- జగనన్న కాలనీనా.. శ్మశాన స్థలమా.. ● చెట్నహల్లిలో ముదిరిన సమస్య
- వెనక్కి తగ్గేదే లేదంటున్న ఇరువర్గాలు ● మరో చోటికి మార్చాలని దళితుల డిమాండ్
- తలలు పట్టుకుంటున్న రెవెన్యూ, పోలీసు అధికారులు
- ఇప్పటికే ఇరువర్గాల్లోని 80 మందిపై కేసులు నమోదు



నది ఒడ్డున ప్రభుత్వం కేటాయించిన శ్మశాన స్థలం

మంత్రాలయం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆరగడుల స్థలం కోసం మొదలైన వివాదం ఆరని చిచ్చులా తయారైంది. చెట్నహల్లిలో దళిత, బీసీ వర్గాల మధ్య తలెత్తిన శ్మశాన గొడవ తెగని సమస్యగా మారింది. ఇప్పటికే ఇరువర్గాల్లోని 80 మందిపై కేసులు నమోదైనప్పటికీ ఎవరూ వెనక్కి తగ్గడం లేదు. శ్మశానాన్ని మార్చాలని దళితులు డిమాండ్ చేస్తుండగా బీసీలు మాత్రం యథావిధిగా ఉంచాలని కోరుతున్నారు. ఈ వివాదం రెవెన్యూ పోలీసులు అధికారులకు తలనొప్పిగా మారింది.

మంత్రాలయం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో 113 సర్వే నెంబరులో 3.83 ఎకరాల రస్తా పోరంబోకు ఉంది. ఇందులో 40 సెంట్లు హైవే రోడ్డుకు, 42 సెంట్లు గురుబోధ తీసుకున్న వారి సమాధుల కోసం, మిగిలిన 22 సెంట్ల స్థలాన్ని గ్రామ రస్తాకు కేటాయించారు. ఇందులో ఉన్న 1.37 ఎకరాల స్థలాన్ని అన్ని కులాల వారు గత 70 ఏళ్లుగా శ్మశానానికి ఉపయోగించుకుంటున్నారు. అయితే ఇదే సర్వే నెంబరులోని 1.42 ఎకరాల భూమిలో గత ప్రభుత్వం జగనన్న కాలనీ ఏర్పాటు చేసింది. దీంతో అసలు సమస్య మొదలైంది.

తుంగభద్ర నది ఒడ్డున కేటాయించినా..

గ్రామానికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న తుంగభద్ర నది ఒడ్డున 126 సర్వే నెంబరులో 3.54 ఎకరాలు శ్మశానం కోసం కేటాయించినట్టు రికార్డులో ఉంది. అయితే ఈ శ్మశానం గ్రామానికి దూరంగా ఉండడంతో ఉపయోగించుకోవడం లేదు. పైగా ఉన్న దారి కబ్జాకు గురి కావడంతో శవాన్ని మోసుకెళ్లడం ఇబ్బందికరంగా మారింది. కొంత మంది ఉన్నత వర్గాలు మాత్రం అతికష్టంపై సాగు చేసిన వరి మడుల్లోనే వెళ్లి అంత్యక్రియలు చేస్తున్నారు. మిగతా కులాలు మాత్రం గ్రామానికి ఆనుకున్న ప్రభుత్వ రస్తా పోరంబోకులోనే అంత్యక్రియలు చేస్తున్నారు. గతంలో ఊరు చిన్నదిగా ఉండటంతో ఎటువంటి సమస్య రాలేదు. ఊరిలో రెండు శ్మశాన వాటికల మధ్య జగనన్న కాలనీకి పట్టా కేటాయించడంతో సమస్య మొదలైంది.

జగనన్న కాలనీ ఏర్పాటు

సర్వే నెంబరు 113లోని 1.42 ఎకరాల్లో జగనన్న కాలనీ పేరుతో 45 మంది దళితులకు పట్టాలు ఇచ్చారు. కొంత మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. కొన్ని బేస్‌మట్టం, లెంటల్, టాప్ లెవెల్‌లో ఉన్నాయి. శ్మశానం పక్కనే ఉండడంతో దళితుల ఇళ్ల ముందు శవాల పుర్రెలు, ఎముకలు, కళేబరాలు వంటివి పడి భయాందోళనకు గురవుతున్నారు. దీంతో శ్మశాన స్థలాన్ని మార్చాలని డిమాడ్ చేస్తున్నారు. గ్రామంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు జరగకుండా అడ్డుకుంటున్నారు. ప్రభుత్వం కేటాయించిన స్థలం శ్మశానంలోనే అంత్యక్రియలు జరుపుకోవాలని కోరుతున్నారు.

శ్మశానాన్ని కబ్జా చేసిన వారికి నోటీసులు జారీ

ప్రభుత్వం కేటాయించిన 126 సర్వే నెంబరులోని 3.54 ఎకరాల శ్మశాన స్థలాన్ని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకున్నారు. 14 సెంట్లు ఆర్‌పీ బసవన్నగౌడు, 89 సెంట్లు బెస్త నాగరాజులు, 85 సెంట్లు తెలుగు భీమన్న ఆక్రమించుకున్నారు. దీంతో వీరికి రెవెన్యూ అధికారులు వీరికి నోటీసులు జారీ చేశారు. అదేవిధంగా సర్వే నెం.125లోని రస్తా పోరంబోకు స్థలాన్ని కూడా కబ్జా చేశారని 2018లో నాటి తహసీల్దార్ దేవ చంద్రశేఖర్ ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చారు.

మిగతా 6వ పేజీలో

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈఓ జనార్దన్ రెడ్డి



జూపాడుబంగ్లా పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో జనార్దన్‌రెడ్డి

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం జూపాడుబంగ్లా, ఆత్మకూరు మండలాల్లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి పరీక్షలపై భయం వీడాలని ఆయన విద్యార్థులకు సూచించారు. విద్యార్థులను విభజించి సీ గ్రేడు ఉన్న విద్యార్థులను ఏ గ్రేడులోకి తీసుకొచ్చి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం తక్కువ వచ్చే పాఠశాలలు, ఆయా అధికారులు, ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బ్రహ్మోత్సవాల్లో ఆర్జిత సేవలు రద్దు

19 నుంచి 23 వరకు శివ దీక్షాపరులకు స్పర్శ దర్శనం

సున్నిపెంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఆలయాలతో పాటు పరివార ఆలయాల్లో ఈ నెల 19 నుంచి మార్చి 3వ తేదీ వరకు అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈఓ ఎం. శ్రీనివాసరావు ప్రకటించారు. ఈ నెల 19 శుక్రవారం నుంచి 23 బుధవారం వరకు మాత్రమే జ్యోతిర్ముడి కలిగిన శివ దీక్షాపరులకు మాత్రమే ఉచిత స్పర్శ దర్శనం ఉంటుందని ఈఓ తెలిపారు. ఇక సాధారణ భక్తులకు ఈ నెల 19 నుంచి మార్చి 3 వరకు అలంకార దర్శనం మాత్రమే ఉంటుందన్నారు. బ్రహ్మోత్సవాల పర్వదినాల్లో ప్రముఖులకు ప్రత్యేక దర్శన వేళలు కేటాయించామన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 129 మంది గైర్హాజరు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షల్లో మంగళవారం 129 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈవో సునీత తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 2,501 మంది విద్యార్థులకు గాను 2,407 మంది హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు నిర్వహించిన పరీక్షల్లో 2,001 మంది విద్యార్థులకు గాను 1,966 మంది విద్యార్థులు హాజరయ్యారు.

తెలుగు వారి హృదయాల్లో

ఘంటసాలకు శాశ్వత స్థానం

రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్

6


నంది అవార్డుతో సమీరా

జోరా.. సమీరా..!

- చెక్కభజనలో మేటి
- రెండు డాక్టరేట్లు, నంది అవార్డులు సొంతం
- విమర్శించిన వారే ప్రశంసలు
- అవమానాలను ఎదుర్కొని ఆదర్శంగా నిలిచి..
- అనుకున్నది సాధించిన ట్రాన్స్ జెండర్

కళ


చెక్కభజన ఆడుతున్న సమీరా

మానసికంగా, సమాజంలో ఒక కనీస గుర్తింపు కోసం తపన పడుతున్న ట్రాన్స్ జెండర్లు ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నారు. అన్ని రంగాల్లో తామేంటో నిరూపించుకుంటున్నారు. నిజానికి చాలా మందిలో ట్రాన్స్ జెండర్లు అంటే ఓ చులకనభావన ఉంటోంది. చీరలు, చప్పట్లు, కరుకుగా ఉండే గొంతుకలు.. దారిన వెళ్తుంటే ఆపి డబ్బులు డిమాండ్ చేస్తూ చికాకు పెడుతుంటారని చాలా మంది అనుకుంటుంటారు. నిజానికి లింగ సమానత్వంలో మహిళలు తమ హక్కుల కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నారు. కానీ ట్రాన్స్ జెండర్లకు కూడా హక్కులు ఉంటాయని, వాటి కోసం పోరాటం చేయాలన్న ఆలోచన రావడానికే చాలా సమయం పట్టింది. ఈ క్రమంలో ట్రాన్స్‌జెండర్లు వివిధ రంగాల్లో రాణిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. ఇదే కోవకు చెందిన వారే తుగ్గలి మండలం గుండాల్‌తండాకు చెందిన డాన్సర్ సమీరా. జీవితంలో ఎన్ని అడ్డంకులు వచ్చినా తన గమ్యాన్ని చేరేందుకు అహర్నిశలు కృషి చేసిన ఆమె స్వయంకృషితో చెక్కభజన నేర్చుకుని అదే తన వృత్తిగా ఎంచుకుంది. ఉత్తమ ప్రతిభ కనబరిచి ట్రాన్స్‌జెండర్ సమీరా నుంచి డ్యాన్సర్ సమీరాగా ఎదగడమే కాకుండా డాక్టరేట్లు, నంది అవార్డులు కూడా పొంది విమర్శకుల నుంచే ప్రశంసలు పొందుతోంది.

తుగ్గలి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం గుండాల్‌తండాకు చెందిన షెనావత్ సుబ్బరాయుడు నాయక్, గోవిందమ్మబాయి దంపతులకు ఇద్దరు కవలలు. వారిలో ఒకరైన సమీరా 14 ఏళ్ల వయస్సులో ఇంటిలో నుంచి వెళ్లి ట్రాన్స్‌జెండర్‌గా మారాలని నిర్ణయించుకుంది. అయితే అప్పుడు గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులను హేళనగా చూడటంతో పాటు అసహ్యించుకున్నారు. చుట్టుపక్కలవారి విమర్శలతో విసుగెత్తిన తల్లిదండ్రులు కూడా సమీరాను దూరంగా ఉంచారు. అదే కసితో ట్రాన్స్‌జెండర్‌గా మారిన సమీరా.. ఎలాంటి అసాంఘిక కార్యకాలపాలు, భిక్షాటన వంటివి చేయకుండా తనకు ఇష్టమైన డ్యాన్స్‌నే కళగామార్చుకుంది. ఎంతో కష్టపడి చెక్కభజనలో మెలకువలు పొందింది. ఏడాదిపాటు శిక్షణా కార్యక్రమాలకు వెళ్తూ పలువురి మాస్టర్లతో డ్యాన్సులు నేర్చుకుంది. మారుమూల గిరిజన గ్రామాల్లో పుట్టి.. ట్రాన్స్‌జెండర్‌గా మారి చీదరించుకున్న కుటుంబ సభ్యులు, బంధువు ఆమె స్వయంకృషి, పట్టుదలే శభాష్ అనిపించుకునేలా చేసింది.

డ్యాన్స్‌కు అవార్డుల పంట


నంది అవార్డు తీసుకుంటున్న సమీరా

సమీరా చెక్కభజనలో చేస్తున్న డ్యాన్సుల నుంచి 2023లో ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమి సంస్థ సమీరాకు గౌరవ డాక్టరేట్‌ను అందించి సత్కరించారు. అలాగే అమెరికన్ రిసమ్ ఫేస్ యూనివర్సిటీ నుంచి 2024లో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అంతేగాకుండా 2024లోను ఆదర్శ కళా నిలయం నుంచి నంది అవార్డు కూడా అందుకున్నారు. అంతేగాకుండా గోవాలో నేషనల్ అవార్డు అందుకున్నారు. ఇలా మరెన్నో అవార్డులు అందుకుని ప్రశంసలు అందుకుంది.

ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ప్రదర్శన

చెక్కభజన కార్యక్రమాలను ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విదేశాల్లో కూడా చెక్కభజన కార్యక్రమాలు నిర్వహించింది. ఇప్పటికే వేల సంఖ్యలో కార్యక్రమాలు చేస్తూ డ్యాన్స్ అంటే తనకు ప్రాణమని చాటి చెప్పింది. సమీరా డ్యాన్స్ చేయడంతో పాటు పలువురికి డ్యాన్స్ కూడా నేర్పిస్తూ వస్తుంది. అంతేకాకుండా చెక్కభజన కార్యక్రమాలు చేయడంలో వచ్చిన ఆదాయాన్ని కుటుంబ పోషణతో పాటు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలకు ఇవ్వడంతో పాటు వెనుకబడిన గిరిజనులకు కూడా తన వంతు ఆర్థిక సాయం అందిస్తూ ట్రాన్స్‌జెండర్లకు సైతం సహాయ సహకారాలు అందిస్తూ వస్తోంది.

డ్యాన్స్ అంటే ప్రాణం

నాకు చిన్నప్పటి నుంచి డ్యాన్స్ చేయడం ఇష్టం. ఆ డ్యాన్స్‌ను ప్రవృత్తిగా ఎంచుకుని కార్యక్రమాలు చేస్తూ వస్తున్నాను. మొదట్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నా కొన్ని కార్యక్రమాల్లో ట్రాన్స్ జెండర్‌తో ఏంటి కార్యక్రమాలు చేయించేది అన్న విమర్శలు కూడా వచ్చాయి. వాటన్నింటిని తట్టుకుని ఒక ఫేమస్ చెక్కభజన డ్యాన్సర్‌గా ఎదిగాను. నా కృషిలో సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటాను. ముఖ్యంగా నన్ను ఆదరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు. నేను జీవించిన కాలం డ్యాన్స్ చేస్తూనే ఉంటాను. వచ్చిన ఆదాయంలో కొంత పేదలను ఆదుకోవడానికి ఖర్చు చేస్తా. ఇలా సేవా కార్యక్రమాలు చేయడం తనకెంతో సంతృప్తినిచ్చింది.

– సమీరా, గుండాల్‌తండా, తుగ్గలి మండలం

డాక్టరేట్ తీసుకుంటూ...



చెట్నహల్లి.. శ్మశాన లొల్లి..!


జగనన్న కాలనీ సమీపంలో పడివున్న పుర్రె, అస్థికలు

వదిలే ప్రసక్తే లేదు



ప్రభుత్వ రస్తా పోరంబోకును తరతరాలుగా శ్మశానం వాటిక కింద ఉపయోగించు కుంటున్నాం. జగనన్న కాలనీ పేరుతో శ్మశానాన్ని రద్దు చేయాలని చూస్తే సహించేది లేదు. శ్మశానాన్ని వదులుకునే ప్రసక్తే లేదు. ప్రభుత్వం గ్రామానికి అనుకొని ఉన్న రస్తా పోరంబోకు స్థలానికి ప్రహరీ కట్టించి అన్ని కులాలకు ఇక్కడే శ్మశాన స్థలంగా ఉంచాలి.

– చాపల నగేష్, గ్రామస్థుడు, చెట్నహల్లి

(5వ పేజీ తరువాయి)

అయినా ఖాతరు చేయకపోవడంతో శ్మశానానికి వెళ్లే దారి లేక అవస్థలు పడుతున్నారు. వరిమళ్లను దాటుకుంటూ శ్మశానానికి వెళ్లి అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు.

126 సర్వే నెంబరులోనే శ్మశాన స్థలం

ప్రభుత్వ ఆర్‌ఎస్‌ఆర్ రికార్డుల పరంగా చెట్నహల్లి గ్రామంలో 126 సర్వే నెంబరులో 3.54 ఎకరాల భూమిని శ్మశాన కోసం కేటాయించారు. గ్రామస్థులంతా అక్కడే అంత్యక్రియలు జరుపుకోవాలి. రానురాను శ్మశానం, దారి కబ్జాకు గురి కావడం, ఊరికి దూరంగా ఉండటంతో పట్టించుకోలేదు. గ్రామానికి ఆనుకుని రస్తా పోరంబోకు స్థలంలో అంత్యక్రియలు నిర్వహించుకుంటున్నారు. గ్రామం మధ్యలో శ్మశానం ఉండటం సరికాదని, ఇరువర్గాలు సరైన నిర్ణయం తీసుకొని సమస్య పరిష్కారానికి సహకరించాలి.



– ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం


అంత్యక్రియలకు వరిచేను మధ్యలో మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే నిర్వహించాలి



ప్రభుత్వం కేటాయించిన 126 సర్వేలో అన్ని కులాల వారు అంత్యక్రియలు చేసుకోవాలి. కబ్జాకు గురైన స్థలాన్ని విడిపించి రహదారి నిర్మించాలి. జగనన్న కాలనీకి ఇచ్చిన దళిత కుటుంబాల మధ్య అంత్యక్రియలు చేయడం సరికాదు. కళేబరాలు, పుర్రెలు మా ఇళ్ల ముందుకు పడేస్తే పిల్లలు, పెద్దలు భయందోళనలకు గురవుతున్నారు. శ్మశానాన్ని ఇక్కడి నుంచి మార్చే వరకు పోరాడుతాం.

– తగరం ప్రసాద్, గ్రామస్థుడు, చెట్నహల్లి

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



చెట్నహల్లి శ్మశాన వివాదంలో ఇరువర్గాల మధ్య జరుగుతున్న వివాదంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవు. ఇప్పటికే ఎస్సీల ఫిర్యాదు మేరకు 50 మంది బీసీలపై, బీసీల ఫిర్యాదు మేరకు 32 మంది ఎస్సీలపై కేసులు నమోదు చేశాం. బీసీలు 32, ఎస్సీలు 32 మంది కలిపి మొత్తం 64 మందిపై 107 సెక్షన్ కింద ఆదోని సబ్ కలెక్టర్‌కు బైండోవర్‌కు ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదు.

– శివాంజల్, ఎస్ఐ, మంత్రాలయం

'నవోదయం'ను విజయవంతం చేయండి

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ సీఐలతో డిప్యూటీ కమిషనర్

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలన కోసం నవోదయం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి సూచించారు. మంగళవారం నంద్యాల, కర్నూలు ఎక్సైజ్ సీఐలు, ఈఎస్‌లతో సమీక్షించారు. సారా, బెల్టు షాపులపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను లోక్ ఆదాలత్‌లో పరిష్కరించుకోవాలని ఆదేశించారు. రెండు జిల్లాలో మద్యం దుకాణాల వద్ద ధరల పట్టికలను ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. శివరాత్రి పండుగ సందర్భంగా స్పెషల్ డ్రైవ్ చేసి అక్రమ మద్యం, సారా వంటి వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలను గడువు లోపు పూర్తి చేయాలని, అలాగే గీతా కులాల మద్యం దుకాణాల ఏర్పాటుకు అవసరమైన ప్రక్రియను తర్వాతగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఐదుగురు సీఐలకు స్థాన చలనం

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రేంజ్ పరిధిలో ఐదుగురు సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు వారిని బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన సీఐల వివరాలు ఇలా..

సీఐ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎల్.విజయలక్ష్మి	డీటీఆర్‌బీ, కర్నూలు	మహిళా పీఎస్-1, కర్నూలు
ఎం.ఆదిలక్ష్మి	మహిళా పీఎస్-1, కర్నూలు	డీటీఆర్‌బీ, కర్నూలు
పి.రాజా	సీసీఎస్-2, నంద్యాల	రాజంపేట, అన్నమయ్య జిల్లా
కే.ఎల్లమరాజు	రాజంపేట, అన్నమయ్య జిల్లా	వీఆర్, అన్నమయ్య
ఏ.సత్యనారాయణ	ఎస్‌బీ-2, అన్నమయ్య	మదనపల్లి రూరల్

అహోబిలంలో హీరో సాయిధరమ్ తేజ్


దిగువ అహోబిలంలో సినీ హీరో సాయి ధరమ్ తేజ్

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలంలో సినీ హీరో సాయి ధరమ్ తేజ్ మంగళవారం సందడి చేశారు. అహోబిలం చేరుకున్న ఆయనకు జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గ సమన్వకర్త మైలేరి మల్లయ్య స్వాగతం పలికారు. ఎగువ అహోబిలంలోని జ్వాలా నరసింహస్వామి, దిగువ అహోబిలం లోని ప్రహ్లాదవరదస్వామిని సాయిధరమ్ తేజ్ దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రాచీన చరిత్ర కలిగిన లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలన్నారు. రాజకీయాలు అంటే ఈజీ కావని.. సినిమాల నుంచి దూరం కాకుండా ప్రేక్షకులను నవ్వించడమే తన ధ్యేయమన్నారు. ప్రస్తుతం సంబరాల్లో ఏటిగట్టు సినిమా షూటింగ్ జరుగుతోందన్నారు. అవకాశం వస్తే మెగాస్టార్ చిరంజీవితో కలిసి సినిమాలో నటిస్తానని సాయిధరమ్ తేజ్ అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు అంజి, రాము, ప్రేమ్ కుమార్, వెంకట సుబ్బయ్య, నరేంద్ర యాదవ్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

తెలుగు వారి హృదయాల్లో ఘంటసాల స్థానం శాశ్వతం

- రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్
- ముగిసిన ఘంటసాల ఆరాధనోత్సవాలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుకు తెలుగు వారి హృదయాల్లో శాశ్వత స్థానం ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా మూడు రోజులుగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగిన 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' మంగళవారం రాత్రి ఘనంగా ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీజీ వెంకటేశ్, గౌరవ అతిథులుగా పారిశ్రామికవేత్త, చిత్ర నిర్మాత బీవీ రెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య హాజరయ్యారు. ఘంటసాల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాదుకు చెందిన ఘంటసాల గానసభ అధ్యక్షుడు కేవీ రావు రచించిన 'ఘంటసాల - రాగశాల' పుస్తకాన్ని అతిథులు ఆవిష్కరించారు. అలాగే 'ఘంటసాల జీవిత చరిత్ర'పై రూపొందించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని సభలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ ఘంటసాల మాస్టారు తన మధురమైన గాత్రంతో వేలాది పాటలు పాడి తెలుగు వారి మనస్సులో సుస్థిర స్థానం పొందారని అన్నారు. ఇప్పటికీ ప్రతి పల్లెలోనూ ఘంటసాల పాటలు, ఆయన ఆలపించిన భగవద్గీత మారుమోగుతూనే ఉంటాయని చెప్పారు. చిత్ర నిర్మాత బీవీ రెడ్డి మాట్లాడుతూ ఘంటసాల పాటను తెలుగు శ్రోతలు ఎవరూ మర్చిపోలేరని, ఆ గాత్రానికి ఆ శక్తి ఉందని అన్నారు.

● అలరించిన సంగీత విభావరి : ఘంటసాల ఆరాధనోత్సవాల్లో భాగంగా మూడోరోజు మంగళవారం రాత్రి నిర్వహించిన అలనాటి ఘంటసాల పాటల సంగీత విభావరి ప్రేక్షకులను ఆసాంతం అలరింపజేసింది. సుప్రసిద్ధ గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి.రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తి, డాక్టర్ సతీష్‌ల బృందం ఎంపిక చేసిన పాటలతో అలరించారు. ఈ సందర్భంగా టీజీ వెంకటేశ్ గాయకులను శాలువలు కప్పి, జ్ఞాపికలు అందజేసి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, డీఎస్పీలు సుధాకర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, త్రీటౌన్ సీఐ శేషయ్య, కాపు సంఘం నాయకుడు ఆర్జా రామకృష్ణ, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ కేజీ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు. కళాక్షేత్రం సభ్యులు ఎస్ఎండీ ఇనాయతుల్లా, సీవీ రెడ్డి, పీపీ గురుమూర్తి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసరెడ్డి, యాగంటీశ్వరప్పలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌తో సత్కారం పొందిన గాయకులు

చెంచుల ఇళ్లకు రుణాలు : ఎమ్మెల్యే



ఇందిరానగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత, కలెక్టరు

పాణ్యం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి నిర్మాణానికి చెంచులకు రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. మంగళవారం పాణ్యంలోని ఇందిరానగర్‌లోని చెంచుల గృహాలను ఆమె కలెక్టరు రాజకుమారితో పాటు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇందిరానగర్‌లోని 167 కుటుంబాలకు గృహాలు మంజూరయ్యాయన్నారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం కింద లబ్ధిదారులకు ఇంటి నిర్మాణానికి రూ. 2. 39 లక్షలు మంజూరు చేస్తుందన్నారు. పొదుపు గ్రూపు మహిళలకు రూ.35 వేలనుంచి రూ. లక్ష వరకు రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. ఇందిరానగర్‌లో ఇప్పటికే 10 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని అన్నారు. కాలనీలో ఇల్లు నిర్మించుకుంటే రోడ్లు, కాల్వలు, తాగునీటి వసతి, వీధి లైట్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు నరేంద్రనాథ్ రెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 4350 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 4222 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 127 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్‌కు 67 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం విద్యార్థులు 3848 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 3789 మంది పరీక్షకు హాజరు కాగా, 59 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో కన్వీనర్ గురువయ్య శెట్టి, డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ సభ్యులు నాగభూషణం రెడ్డి, పద్మావతి, స్క్వాడ్ బృందాల సభ్యులు పర్యవేక్షించారు.

'మద్దతు ధర ఇవ్వాలి'

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో పంట దిగుబడులకు మద్దతు ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు మార్కెట్ యార్డులో గిట్టుబాటు ధరలు అందుతాయనే ఆశతో ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే కాకుండా పక్క రాష్ట్రాలు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను కర్నూలు మార్కెట్ యార్డుకు తెస్తున్నారని, అయితే.. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందడం లేదని అన్నారు. పైగా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారుల అక్రమాలకు తెర పడడంలేదని ఆరోపించారు. ఇదే పరిస్థితి ఇకపై కొనసాగితే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఇప్పటికైనా మార్కెట్ యార్డు అధికారులు తూకాల వద్ద నిఘా పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నంద్యాల - పాణ్యం రైల్వే స్టేషన్ల మధ్యలో కేఎం నెం.261/01-261/02 పోస్టుల మధ్యన రైలు పట్టాల పక్కన గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం మంగళవారం ఉదయం 10:30గంటల ప్రాంతంలో లభ్యమైనట్లు రైల్వే ఎస్ఐ ఎస్.అబ్దుల్ జలీల్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30 ఏళ్లు ఉంటుందని, ప్రమాదవశాత్తూ రైలులో నుంచి కిందపడి మరణించి ఉండవచ్చని చెప్పారు. మృతుడు నల్లటి టీ షర్టు, బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని, నడుముకు బ్రౌన్ కలర్ లెదర్ బెల్ట్ పెట్టుకొని ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసినవారు నంద్యాల రైల్వే పోలీసులను 9440627653, 9441509497 నెంబర్లను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

'స్వచ్ఛ్ దివస్'ను పకడ్బందీగా నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మూడో శనివారం స్వచ్ఛ దివస్‌ను పండుగ వాతావరణంలా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం జడ్పీ నుంచి ఆయన ఎంపీడీవోలు, డీపీఆర్‌సీ అధికారులతో జీఎస్‌డబ్ల్యూ, ఎస్‌బీఎం యాక్టివిటీస్‌పై వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. మిస్సింగ్ సిటిజెన్స్, హౌస్ మ్యాపింగ్, ఎన్‌పీసీఐ యాక్షన్, ఈకేవైసీ తదితర అంశాలపై సూచనలు జారీ చేశారు.

ఇసుక ట్రక్ ఢీకొని వ్యక్తి మృతి

సి.బెళగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందారు. వివరాలివీ.. మండలంలోని గుండ్రేవుల గ్రామానికి చెందిన పెద్ద సోమన్న(50), కుమారుడు రంగస్వామి ఇద్దరు కలిసి మోటార్ సైకిల్‌పై గద్వాల దేవరకు బయలుదేరారు. పోలకల్లు చింతాలమునిస్వామి దేవాలయం దగ్గర ఎదురుగా వస్తున్న ఇసుక ట్రక్ మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. దీంతో పెద్దసోమన్న ట్రక్ టైర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్ఐ తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డ్రైవర్ క్రిష్ణగిరి మండలానికి చెందిన చిన్న రాముడుగా గుర్తించారు. పెద్ద సోమన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుమారుడు రంగస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నంద్యాలలో చైన్ స్నాచింగ్



బాధితురాలు ఆదిలక్ష్మి

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటవీధిలో బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలోని చైన్ అపహరించుకుని పరారయ్యారు. వన్‌టౌన్ సీఐ సుధాకర్‌రెడ్డి, బాధితురాలు ఆదిలక్ష్మి తెలిపిన మేరకు వివరాలు... డోన్‌కు చెందిన ఆదిలక్ష్మి పట్టణంలోని జగజ్జననీదేవి ఆలయాన్ని సందర్శించేందుకు నంద్యాలకు చేరుకున్నారు. మంగళవారం అమ్మవారిని దర్శించుకుని బంధువుల ఇంటికి బయల్దేరింది. మార్గమధ్యంలో కోటవీధిలో నడుస్తూ వెలుతున్న ఆదిలక్ష్మి వెనుకవైపు నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు అగంతకులు మహిళ మెడలోని ఐదు తులాల గొలుసును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తారా?

ఆలూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఫర్ ఔట్ సోర్సింగ్‌ను రద్దు చేసి ఏజెన్సీల ద్వారా పాత విధానంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఏజెన్సీల పరిధిలోకి తీసుకు రావాలని రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇది జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సంఘాల రెండు రోజులుగా వాట్సాప్ గ్రూప్‌లో సోషల్ మీడియాలో పోస్టు పెడుతున్నారు.

- ఏజెన్సీల ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి కసరత్తు
- అయోమయంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు
- ఆయా శాఖల నుంచే జీతాలు చెల్లింపులకు యూనియన్ల డిమాండ్

● పాత విధానం తీసుకొచ్చే యోచనలో ప్రభుత్వం

ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్ సోర్సింగ్ విధానంలో భర్తీ చేసేందుకు ప్రైవేటు ఏజెన్సీల ద్వారా చేపట్టేవారు. అయితే మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల అర్హులకు న్యాయం జరిగేది కాదు. అడ్డగోలుగా మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులతో నియామకాలు జరిగేవి. దీంతో ఏజెన్సీలు సకాలంలో వేతనాలు చెల్లించక ఈపీఎఫ్ సక్రమంగా ఖాతాల్లో జమ చేయాక ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు తీవ్ర నష్టం జరిగేది. రాజకీయ సిఫార్సులతో ఉద్యోగులను తొలగించిన సంఘటనలు ఉన్నాయి.

● ఒకే గొడుగు క్రిందకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

గత ప్రభుత్వంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆంధ్రప్రదేశ్ ఔట్ సోర్సింగ్ ఫర్ కార్పొరేషన్ (ఆప్కాస్) విధానాన్ని తీసుకొచ్చి ప్రతి నెల 1 నా వేతనాలు నేరుగా ఉద్యోగుల ఖాతాలో జమచేసి వేతనానికి ముందే ఈపీఎఫ్ కూడా సక్రమంగా జమ చేసే ప్రక్రియను శ్రీకారం చుట్టారు.

● ఆప్కాస్ రద్దుతో ఉద్యోగుల్లో ఆందోళన

ఆప్కాస్ విధానం రద్దు చేస్తామని ప్రభుత్వ నిర్ణయంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొంది. ఏళ్ల తరబడి ఉద్యోగాలు చేస్తున్న వారిలో సందిగ్ధం నెలకొంది. ఉద్యోగాలు ఉంటాయా ఊడుతాయా అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లాల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో 20 వేలకు పైగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు.

● కాంట్రాక్టు విధానమే ఉద్యోగులకు మేలు

ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దు చేసినా అందులో ఉన్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టర్ పరిధిలోకి తీసుకువచ్చి నేరుగా ఆయా శాఖల హెచ్‌వోడీల ద్వారా జీతాలు చెల్లిస్తే ఉద్యోగులకు మేలు జరుగుతుందని, ఉద్యోగ భద్రత కలుగుతుందని ఉద్యోగుల అభిప్రాయం. ఆ దిశగా ప్రభుత్వం పునరాలోచించాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.



ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్టు విధానంలోకి మార్పు చేయాలని స్టేట్ సమగ్ర శిక్ష అధికారి దేవానంద్ రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు(ఫైల్)

● కాంట్రాక్టు పరిధిలోకి తీసుకురావాలి

కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి పాత విధానం ద్వారా ఏజెన్సీల ప్రజల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తోంది. ఇలా చేస్తే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారు. మితిమీరిన రాజకీయ జోక్యంతో ఉద్యోగగ భద్రత పోతుంది. ఈపీఎఫ్ డబ్బులు గతంలో ఏజెన్సీలు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా దిగమింగిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రభుత్వం మరోసారి పునరాలోచించి ఔట్సోర్సింగ్ ఉద్యోగులను కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకువచ్చి నేరుగా ఆయా శాఖ అధిపతుల ద్వారా ప్రతినెల జీతాలు చెల్లించేలా చర్యలు చేపడితే ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మేలు జరుగుతుంది

\- ముహమ్మద్ రఫీ, ఏపీ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర నాయకుడు

APCOS ఉపాధి

● అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం తగదు

ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడేందుకు అప్కాస్‌ను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకుంది. దీని వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న రెండు లక్షల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. సంస్థలకు వారిని అప్పజెప్పాలనే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే ఉద్యోగ భద్రత కరువు అవుతుంది. ఒకవేళ ఆప్కాస్ విధానం రద్దు చేయాలనుకుంటే అందులో ఉన్న ఉద్యోగులందరినీ కాంట్రాక్ట్ పరిధిలోకి తీసుకురావాలి.

\- రమేష్‌బాబు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి

డి.బెళగల్ నుంచి జపాన్‌కు...

- ల్యాగ్రోస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన హుశేన్‌సాబ్
- పేదింటి నుంచి ఎదిగిన వైనం
- దాతలు ఆదుకోవాలి .. క్రీడాకారుడి విజ్ఞప్తి



జాతీయ ల్యాగ్రోస్ జట్టులో తోటి క్రీడాకారులతో హుశేన్ సాబ్



అంతర్జాతీయ ల్యాగ్రోస్ క్రీడకు ఎంపికైన డి.బెళగల్ గ్రామానికి చెందిన హుశేన్ సాబ్

కోసిగి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డి. బెళగల్ గ్రామానికి చెందిన పింజారి రసూల్ సాబ్, చాంద్‌బీ రెండో కుమారుడు హుశేన్ సాబ్ డిగ్రీ చదువుతున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ల్యాగ్రోస్ క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టులో మండల పరిధిలోని డి.బెళగల్ గ్రామంలో రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి ల్యాగ్రోస్ క్రీడ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హుశేన్ సాబ్‌ను అంతర్జాతీయ స్థాయి ల్యాగ్రోస్ పోటీలకు ఎంపికైనట్లు జాతీయ ల్యాగ్రోస్ అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ నెల 17న జపాన్ దేశంలో జరిగే భారతదేశం ల్యాగ్రోస్ క్రీడా జట్టు తరపున హుశేన్‌సాబ్ పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. అయితే హుశేన్ సాబ్ పేదింటి కుటుంబం కావడంతో ఆ దేశంలో క్రీడల్లో పాల్గొనేందుకు సుమారు రూ.2లక్షల దాకా ఖర్చు వస్తుందని, దాతలు ఎవరైనా ఆదుకుంటే అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తానని క్రీడాకారుడు హుశేన్ సాబ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు, దాతలు సహకరించి తనకు ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కిస్తే అంతర్జాతీయ క్రీడాస్థాయిలో రాణించి దేశానికి మంచి పేరు తెస్తానని హుశేన్ సాబ్ తెలిపారు. హుశేన్‌సాబ్ అంతర్జాతీయ క్రీడలకు ఎంపిక కావడం పట్ల కోసిగి మండల ప్రజలు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలిపారు. డీ.బెళగల్ గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యంలో క్రీడాకారుడికి తమకు తోచినంత సాయం అందజేస్తామని తెలిపారు.

ఆ చట్టాలను రద్దు చేయడం సరికాదు

● ఏపీడబ్ల్యూజేఎఫ్



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా జర్నలిస్టుల హక్కుల కోసం ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేయడం సరికాదని, తక్షణం కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జి. ఆంజనేయులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాలు జర్నలిస్టులపై కక్షలు కట్టి అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. దేశంలో చాలా రాష్ట్రాలు జర్నలిస్టులకు పెన్షన్ పథకం అమలు చేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి టి. మద్దిలేటి, రాష్ట్ర నాయకులు బి. గోరంట్లప్ప, కేబీ శ్రీనివాసులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ



వెంకటాపురం సమీప ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కాలినడకన వచ్చే భక్తులకు ఏర్పాట్లు

కలెక్టర్ జి.రాజకుమారి

సున్నిపెంట, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వేల సంఖ్యలో కాలినడకన వచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. మంగళవారం వెంకటాపురం నుండి వస్తున్న భక్తులను కైలాస ద్వారం వద్ద కలిసి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. కైలాసద్వారం నుండి అటవీమార్గంలోని తుమ్మలబైలు, పెచ్చెరువు, నాగలూటి గూడెం, వెంకటాపురం వరకు కలెక్టరు ప్రయాణించారు. ఈ ప్రదేశాలలో భక్తులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వెంకటాపురం నుండి కైలాస ద్వారం వరకు 46 కిమీ ప్రయాణించ వలసి వుంటుందని, ఇప్పటికి 12 ప్రదేశాలు గుర్తించి ఆ ప్రదేశాలలో భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక పందిళ్లు, భోజన వసతి, తాగు నీరు, వైద్య సదుపాయాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా వుండాలని అన్నారు. అంబులెన్సులను, వైద్య పరికరాలను సిద్ధం చేసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింటు కలెక్టర్ విష్ణుచరణ్, ఎస్పీ ఆధిరాజ్ సింగ్ రాణా, దేవస్థానం ఈవో ఎం. శ్రీనివాసరావు, డీఎఫ్ఓ అబ్దుల్ రవూఫ్ తదితరులు ఉన్నారు.

'కారుణ్య నియామకాలు చేపట్టాలి'



మాట్లాడుతున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి శాఖలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సూర్యనారాయణ మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ పి.రంజిత్ బాషాకు విజ్ఞప్తి చేశారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యాలయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఉపాధ్యాయ ఉద్యోగులు ఎంతో నష్టపోయారన్నారు. అంతేగాకుండా ఉద్యోగులను మానసికంగా వేధింపులకు గురి చేశారని ఆరోపించారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగ పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలని గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తే వైసీపీ ప్రభుత్వం తనపై తప్పుడు కేసులు బనాయించడంతో పాటు నా కుటుంబాన్ని అనేక ఇబ్బందులకు గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులపై నమోదైన తప్పుడు కేసులను కూటమి ప్రభుత్వం ఎత్తివేయాలన్నారు. ఉద్యోగుల సర్వీసు సమస్యల పరిష్కారం కోసం అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కోరారు. 12వ పీఆర్సీ పై త్రిసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నగర అధ్యక్షుడు మురళీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు



మాట్లాడుతున్న జేసీ డాక్టర్ బి. నవ్య

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): సిలిండర్ డెలివరీకి అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు తప్పవని గ్యాస్ ఏజెన్సీలను హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీల సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలోని పలు గ్యాస్ ఏజెన్సీలు సిలిండర్ డెలివరీ చేసే సమయంలో అదనపు చార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఏ వినియోగదారుల నుంచి డీలర్ అదనంగా వసూలు చేయకూడదన్నారు. ఐవీఆర్ఎస్ సర్వే ద్వారా ఫిర్యాదులు అందిన 24 ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. వారి వివరణ ఆధారంగా గ్యాస్ ఏజెన్సీలపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఎస్‌వో రాజా రఘువీర్, ఓఎంసీ జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్, గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

నంద్యాల

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం

చెంచులకు ఆధార్ క్యాంపు

పాణ్యం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పాణ్యం ఇందిరానగర్‌లోని చెంచులకు ప్రత్యేకంగా ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు సచివాలయం కార్యదర్శి శివకుమార్ తెలిపారు. మంగళవారం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉచితంగా ఆధార్ క్యాంపు ఏర్పాటు చేసి కార్డులు మంజూరు చేశారు. శ్రీశైలం ఐటీడీఏ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా వ్యాప్తంగా మహిళలకు, పురుషులకు, వృద్ధులకు కార్డులు లేనివారికి, కార్డులు ఉన్నా వేలిముద్రలు పడని వారికి, అర్హత ఉన్న పిల్లలకు ఆధార్ కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు ఉచితంగా ఆధార్ క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

పాణ్యం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల ఎంసీఏ విద్యార్థి జకీవుల్లా రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9వతేదీన ఆళ్లగడ్డలోని వైపీపీఎం జూనియర్ కళాశాలలో జరిగిన టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో ఉమ్మడి జిల్లాల జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థి ఈనెల 21వ తేదీ నుంచి చంద్రగిరిలో జరిగే పోటీలలో పాల్గొంటాడని చెప్పారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.

నంద్యాల ఎడ్యుకేషన్: నంద్యాల శ్రీ శాంతినికేత్ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటుచేశారు. ఈనెల 21,22,23వ తేదీల్లో తిరుపతి జిల్లా చంద్రగిరిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు వివరించారు. ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

వెలుగోడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభచాటారు. ఎడ్యుకేషనల్ ఎపిపని ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జనవరిలో నిర్వహించిన ఈఈఎంటీ-2025 స్కాలర్‌షిప్ వేతనాల పరీక్షలో విద్యార్థులు సత్తా చాటారు. పదో తరగతి విద్యార్థి శ్రీనాథ్, 7వ తరగతి విద్యార్థి రిషికుమార్ జిల్లాలో మొదటి ర్యాంక్ సాధించారు. ఇటీవల విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సైమాక్ డైరెక్టర్ మస్తానయ్య చేతుల మీదుగా రూ.8 వేల చొప్పున నగదుతో పాటు ధ్రువపత్రం, మెమెంటోలు అందుకున్నారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ నళిని ఉపాధ్యాయులు అభినందించారు.

రిలే నిరాహార దీక్ష విరమణ



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

పాణ్యం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పాణ్యం మండల సమస్యల పరిష్కారానికి చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షను మంగళవారం విరమించారు. తహసీల్దారు నరేంద్రనాథ్‌రెడ్డి దీక్షా దారులను నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తమ న్యాయమైన డిమాండ్‌లను వెంటనే నెరవేర్చాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. దీక్షలను జయప్రదం చేయడానికి సహకరించిన గ్రామ ప్రజలకు, ప్రజాసంఘాల నాయకులకు, విద్యార్థు లకు కృతజ్ఞులు తెలిపారు. ఈ దీక్షల్లో సమాజ్‌వాది పార్టీ జిల్లా అధ్య క్షుడు శివకృష్ణ యాదవ్, సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్ కుమార్, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నాయకులు వెంకటాద్రి, ఎన్ఎస్‌యూఐ నాయకుడు రాజుయాదవ్, వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు వనం రాజు, రవీంద్రనాయక్, ప్రతాప్, మద్దయ్య, పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి మంగళవారం కర్ణాటక సింధునూరుకు చెందిన కె.బృందం అనే భక్తురాలు రూ. 1,00,116 విరాళాన్ని పర్యవేక్షకులు ఎం. మల్లికార్జునకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సన్మానించారు.

'ప్రతి రైతుకూ గుర్తింపు సంఖ్య'

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ ప్రభుత్వం విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రసాదరావు తెలిపారు. మంగళవారం పులిమద్ది, బీమవరం గ్రామాలలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి'

ఆత్మకూరురూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మినము, కంది పంటలు సాగు చేసిన రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి, డీఆర్సీ ఏవో హేమలత సూచించారు. శ్రీపతిరావుపేట, పిన్నాపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో మంగళవారం సమీకృత వ్యవసాయంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పురుషులతో పాటు, మహిళలు కూడా రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం వారిని ఆర్థికాభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు కృషి చేయనుందని రైతు ఉత్పత్తిదారుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ సురేష్, వెలుగు ఏపీఎం, ఏవో కృష్ణారెడ్డి అన్నారు. వారు మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ శాఖల సమన్వయంతో రైతుల అభివృద్ధికి కావాల్సిన అవసరాలను, పథకాలను ప్రభుత్వం ఆదిశగా ప్రయత్నం చేస్తుందన్నారు. మహిళలు కూడా రైతు ఉత్పత్తి సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి పావని, సెరికల్చర్ కాశీవిశ్వనాథం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి: డీఈవో

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందజేసే మధ్యాహ్న భోజనం నాణ్యతా ప్రమాణాలతో వండాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని డీఈవో పీ.జనార్ధన్‌రెడ్డి నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం డీఈవో ఆత్మకూరు ఎంఈవో బాలాజి నాయక్‌తో కలిసి మండలంలోని పలు పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పదె తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలను సమీక్షించారు.విద్యార్థులు పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలోని ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రాబోయే పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా విద్యార్థులకు సులభతరమైన బోధనా సరళి ద్వారా బోధించాలని సూచించారు. ఆ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు.

అరకొర సౌకర్యాలు

- చెప్పులు, నూనె పంపిణీ చేయని వైనం
- దయనీయంగా పారిశుధ్య కార్మికుల పరిస్థితి



చెత్త వేయడానికి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ సంచి



దెబ్బతిన్న డబ్బా



చెత్తను సేకరిస్తున్న కార్మికులు

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం నంద్యాల రాష్ట్రంలో ఉన్న ప్రముఖ మున్సిపాలిటీలో ఒకటి. అయితే పేరు గొప్ప ఊరు దిబ్బలా ఆ స్థాయి పనితీరు మున్సిపల్ పాలనలో లేదు. స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అరకొర సౌకర్యాలతో విధులు నిర్వహిస్తున్నారు. గత కొంత కాలంగా సబ్బులు, గ్లవ్స్, నూనె సైతం పంపిణీ చేయటం లేదని పలువురు కార్మికులు చెబుతున్నారు. గ్లవ్స్ లేక పోవడంతో తర చుగా చెత్తలో ఉన్న మేకులు, గాజులు గుచ్చుకుని కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు.

ప్లాస్టిక్ సంచుల్లోనే చెత్త తరలింపు

మున్సిపల్ పరిధిలో 42 వార్డులో ఉన్నాయి. పట్టణంలో 450 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నారు. ప్రతి వార్డులో చెత్తను తరలించే బండ్లతో పాటు ట్రాక్టర్ సిబ్బందికి సైతం చెత్త బుట్ట లను సరఫరా చేయ లేదు. అధికాలను అడి గితే ఇబ్బందులు ఎదరవుతాయేమోనన్న భయంతో కార్మికులు గత్యంతర లేని పరిస్థి తుల్లో ప్లాస్టిక్ సంచుల్లో చెత్తను తరలిస్తున్నారు. తోపుడు బండ్ల కొరత కూడా ఉంది. సుమారు 50కి పైగా బండ్ల అవసరం ఉంది. ట్రాక్టర్లు సైతం నిర్వహణలోపంతో తరచుగా మొరా యిస్తున్నాయి. శానిటరీ సూపర్‌వైజర్‌ను వివరణ కోరగా.. తాను బాధ్య తలు చేపట్టిన తర్వాత యూనిఫాం కోసం ఆర్డర్ ఇచ్చామని, నెలలోపు కార్మికులకు అందజేస్తామని చెప్పారు. సబ్బులు అందజేశామని, ఇతర సౌకర్యాలు కూడా కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

గడివేముల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. గడివేములలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ నాగమద్దమ్మ ఆధ్వర్యంలో మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే గౌరు చరిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు అధికంగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని సూపర్‌వైజర్ కుమారి, గడివేములలో తాగునీరు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ మహేశ్వర్‌రెడ్డి, కొరపొలూరులో ప్రభుత్వ భూములు అన్యాక్రాంత మయ్యాయని, జాతీయ ఉపాధిహామీ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని సర్పంచ్ మాలిక్‌బాషా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. అధికారుల తీరు సక్రమంగా లేదని, ఇలాగైతే సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తానని మాలిక్‌బాషా అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొరపొలూరులో ప్రభుత్వ, ప్రైవేటు భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధిహామీ పథకంలో అవకతవకలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో వాసుదేవగుప్తా, తహసీల్దార్ వెంకటరమణ, జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

'కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి'

రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆమె రైతు సేవా కేంద్రాలను ప్రారంభించారు. మండలంలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఏడీఏ రాజశేఖర్, ఏవో హేమసుందర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పంట రామచంద్రారెడ్డి, మురళీమోహన్ రెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, కృష్ణయాదవ్, గని హర్ష, గిరిబాబు, ఎస్ఏ రఫీక్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి

నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



దుద్యాలలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

కొత్తపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించిందని, కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మండలంలోని ఎదురుపాడులో రూ.35 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయాన్ని, రూ.23.90 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని, అలాగే దుద్యాలలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయా గ్రామాల సర్పంచులు షేక్ నజీయా, చందమాల శోభలతల అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మాణాలు పూర్తి చేసినట్లు తెలిపారు. దుద్యాల గ్రామ శివారులోని మెయిన్ రోడ్డు నుంచి జంబులమ్మ గుడి వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.60 లక్షల నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో రూ.25 లక్షలతో సీసీ రోడ్లు పూర్తి చేశామని తెలిపారు. ఇదిలావుంటే ఎదురుపాడు గ్రామ టీడీపీ నాయకులు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి జడ్డారిపల్లె వద్ద లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, అలాగే త్రీఫేజ్ కరెంటు కోసం సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం దుద్యాల గ్రామ సభలో గువ్వలకుంట్ల గ్రామానికి చెందిన రామానాయుడుకు సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.35వేల విలువ చేసే చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీపీ కుసుమలత, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ మండల కన్వీనర్ నారపురెడ్డి, పీఆర్ డీఈ ధనిబాబు, వైస్ ఎంపీపీలు సింగారం వెంకటరమణ, జయమ్మ, స్థలదాత మల్లారెడ్డి, ఉప సర్పంచ్ మన్సూర్‌వలి, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, నారాయణ, ఏడీఏ ఆంజనేయ పాల్గొన్నారు.

వైసీపీ కనుసన్నల్లో మున్సిపల్ కార్యాలయం

- తీరు మారకుంటే ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తా
- అధికారులకు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి హెచ్చరిక



మున్సిపల్ కార్యాలయంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారిందని, కూటమి ప్రభుత్వం వచ్చినా వైసీపీ నాయకుల కనుసన్నల్లో మున్సిపల్ అధికారులు నడుతున్నారని మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్, ప్రముఖ న్యాయవాది టి. తులసి రెడ్డి ఆరోపించారు. అధికారుల తీరు మారకుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఫిర్యాదు చేస్తామని కమిషనర్ నిరంజన్‌రెడ్డిని హెచ్చరించారు. ఇటీవల మున్సిపల్ అధికారులు తీరు వివాదస్పదంగా మారిన నేపథ్యంలో మంగళవారం తులసి రెడ్డి బాధితులతో కలిసి కమిషనర్ నిరంజ్ రెడ్డిని నిలదీశారు. మున్సిపల్ అధికారుల అవినీతితో పాటు వేధింపులకు మున్సిపల్ కార్యాలయం అడ్డాగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో టిడ్కో గృహాల్లో కరోనా రోగులకు కేవలం తాగు నీటి సరఫరాకే వైసీపీ నేతల అనుచరుడు రూ.2 కోట్లు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. పట్టణంలో పార్కుల నిర్వాహణ నుంచి భవనాల నిర్మాణం వరకు మున్సిపల్ కార్యాలయ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారన్నారు. మున్సిపల్ పార్క్‌లో చిరువ్యాపారులను గెంటివేసిన మీరు ప్రైవేటు వ్యక్తులు నడుపుతున్న యోగా కేంద్రాన్ని ఎందుకు తొలగించలేదని తిరువీధి మణికంఠ కమిషనర్‌ను నిలదీశారు. యోగా కేంద్రంపై చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన నాయకులు తదితరులు ఉన్నారు.

'అడవులను కాపాడుకోవాలి'

పాణ్యం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): అడవులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడుకోవాలని డీఆర్వో విజయలక్ష్మి పిలుపునిచ్చారు. అటవీ సంరక్షణ పై మంగళవారం కొనిదేడు, సుగాలిమెట్ట గ్రామాలలో కళా జాతా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అడవులను అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. అడవులను కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమన్నారు. అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు పాటుపడతామని విద్యార్థులతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహించారు. కళాజాత కళాకారులు ప్రతాప్ ఆధ్వర్యంలో సభ్యులు అటవీ సంరక్షణపై జానపద గేయాలతో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీవో లక్ష్మీదేవి, జమాల్‌సా, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీఏవో



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ

మహానంది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటల సాగులో రసాయనిక పురుగు మందుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయాధికారి బి. మురళీకృష్ణ సూచించారు. గాజులపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏవో బి. నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఏవో మాట్లాడుతూ రైతులు వరి పంటకు అవసరం మేరకు యూరియా ఎరువులను ఉపయోగించాలని సూచించారు. దేశవాళి వరి రకాలైన కుజు పటాలియా, శివన్‌సాంబ, చిట్టిముత్యాలు లాంటి తక్కువ గ్లైసిమిక్ ఇండెక్స్ ఉన్న వరి రకాలను సాగు చేసి ఆహారంగా తీసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యాన్ని పొందవచ్చునని తెలిపారు. సొంత పొలం కలిగి ఉన్న ప్రతి రైతుకు 11 అంకెల రైతు విశిష్ట సంఖ్యను ఇస్తున్నామని, దీని కోసం సంభధింత రైతు సేవా కేంద్రాలకు పొలం పాసు పుస్తకం, ఆధార్‌కార్డు, ఆధార్‌లింక్‌తో లింక్ అయిన మొబైల్ నంబర్ కలిగిన ఫోన్‌తో వెళ్లి వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అయిన పీఎం కిసాన్, పంట బీమా, పంట నష్ట పరిహారం వంటి మెదలగు పదకాలు అందుతాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ నరేంద్రారెడ్డి, గాజులపల్లి పశువైద్యులు శివానంద్, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

'ఆక్రమణలు తొలగిస్తాం'



దుకాణాల వద్ద కొలతలు వేస్తున్న అధికారులు

పాములపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పాములపాడులో వ్యాపారులు అక్రమ ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించాలని, లేకపోతే తొలగిస్తామని ఈవోఆర్డీ రాముునాయక్ హెచ్చరించారు. మంగళవారం పాములపాడులోని బస్టాండు కూడలిలో అక్రమ ఆక్రమణలను తొలగించేందుకు కొలతలు వేశారు. ఈవోఆర్డీ మాట్లా డుతూ వ్యాపారులు ఆక్రమణలు తొలగించాలంటూ నోటీసులు గత పది రోజుల క్రితం ఇచ్చామని, మరో రెండురోజులు గడువు ఇచ్చామని చెప్పా రు. సర్పంచ్, సర్వేయర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా భీష్మ ఏకాదశి వేడుకలు



హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతులు, పురోహితులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనుభారతి క్షేత్రంలో కాకనూరు శారదామఠం పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామీజీ ఆధ్వర్యంలో 66వ భీష్మ ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రెండో రోజు మంగళవారం తెల్లవారుజామున మంగళవాయిద్యాలతో అమ్మవారిని మేలుకొలుపు, పంచామృతాభిషేకాలు, అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, మహానివేదన, అనంతరం క్షేత్ర ప్రాంగణంలో శ్రీలక్ష్మి గణపతి హోమం, సరస్వతి, చండీ హోమాలు, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు.

సుబ్రహ్మణ్య స్వామికి పూజలు

శ్రీశైలం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మంగళవారం లోకకళ్యాణార్థం ఆలయ ప్రాంగణంలోని సుబ్రహ్మణ్య (కుమారస్వామి), నందీశ్వరస్వామికి, బయలు వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దేశం శాంతిసౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం పూజా కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిస్వామికి పూజలు చేశారు. పంచామృతాలతో అభిషేకించి మహా మంగళ హారతులు సమర్పించారు.

పెన్షనర్ల సంఘం ఎన్నికలు వాయిదా

నంద్యాల ఎడ్యుకేషన్/రూరల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా పెన్షనర్‌ల సంఘం ఎన్నికలను వాయిదా వేసినట్లు పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల అధికారి పెద్దన్నగౌడ్ తెలిపారు. పెద్దన్నగౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లా పెన్షనర్‌ల సంఘానికి 14వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. చాలామంది పెన్షనర్‌లు బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు జరుపాలని కోరడంతో ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. తదుపరి ఎన్నికల ప్రక్రియను రాష్ట్ర సంఘం ఆదేశానుసారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఆటో, బైకు ఢీ.. ఇద్దరికి గాయాలు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): నంద్యాల నూనెపల్లె ఫ్లై ఓవర్‌పై జరిగిన ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు మంగళవారం తెలిపారు. బృందావనం కాలనీకి చెందిన దినేష్ మంగళవారం ఇంటికి వెళ్తుండగా అటుగా వచ్చిన ఆటో దినేష్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొనడంతో అతడు గాయపడ్డాడు. శిల్పా నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రమణకు స్వల్ప గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీపుటేజీలను పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

కారు ఢీకొని రైతుకు..

మహానంది: పొలం పనికి వెళ్లి తిరిగి వస్తూ ప్రధాన రహదారి పక్కన ఆగి ఉన్న రైతు నాగరాజును కారు ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. మహానంది మండలం గాజులపల్లి గ్రామానికి చెందిన నాగరాజు అనే రైతు మంగలవారం పొలానికి వెళ్లారు. తిరిగి వస్తూ మార్గమధ్యంలోని ఆంజనేయపురం గ్రామం ప్రధాన రోడ్డు పక్కన నిల బడి ఉండగా నంద్యాల వైపు నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రైతును రోడ్డు సేఫ్టీ పోలీసులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సారా స్థావరాలపై ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం పట్టణంలోని నీలిషికారీ కాలనీలో 1400 లీటర్లు బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు 45 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆ శాఖ ఎస్ఐలు మారుతిప్రసాద్, జఫ్రూల్లా తెలిపారు. ఈ దాడుల్లో ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ అధికారులు కుమారి, శ్రీనివాసులు, సుధీర్‌కుమార్, మధు, ప్రసాద్ రమీజా పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ప్రతిభ



నరసింహ



ప్రకాశ్



సయ్యద్ అనిష తబస్సుమ్

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మంగళవారం వెలువడిన జేఈఈ మెయిన్స్ పరీక్షా ఫలితాల్లో నంద్యాల జిల్లా విద్యా ర్థులు తమ సత్తాచాటారు. ఎస్‌డీఆర్ కళాశాలకు చెందిన పి.నరసింహ 99.85 పర్సంటైల్ సాధించగా, అదే కళాశాలకు చెందిన మరో విద్యార్థి గుగన్ ప్రకాశ్ 99.46 పర్సంటైల్ సాధించారు. అలాగే పట్టణంలో న్యూక్లియస్ కళాశాలకు చెందిన సయ్యద్ అనిష తబస్సుమ్ 99.37 పర్సంటైల్ సాధించారు. అత్యుత్తమ పర్సెంటేజి సాధించిన విద్యా ర్థులను విద్యాశాఖాధికారులు, కళాశాలల యజమానులు అభినందించారు.

'ఎస్టీ పునరుద్ధరణకు కలిసి రావాలి'



నూతన కమిటీ సభ్యులతో పులికొండన్న

నందికొట్కూరు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): ఎస్టీ పునరుద్ధరణ కోసం పార్టీలకతీతంగా కలిసి రావాలని వివిధ రాజకీయ పార్టీల్లో ఉన్న ఎమ్మెల్యేలు, ఎంపీలను ఎంవీఆర్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న కోరారు. మంగళవారం నందికొట్కూరు పట్టణంలో ఎంవీఆర్పీఎస్ నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా తూడిచర్ల రాముడు, ప్రధాన కార్యదర్శిగా మిట్టకందాల శంకర్, ఉపాధ్యక్షుడిగా లింగాలరమణ, న్యాయ సలహాదారులుగా వెంకటరాముడు, వెంకటేశ్వర్లు, మిడ్తూరు మండల అధ్యక్షులుగా నల్లబోతుల సామన్న, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మల్లీ, రామకృష్ణ, కార్యదర్శిగా వెంకటరమణ, పగిడ్యాల మండ అధ్యక్షులుగా సత్యం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులుగా విజయుడు, స్వాములు లను నియమించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లారం రవి, యూత్ నాయకులు సురేష్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పాములపాడు, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఏసీడీపీవో మంగవళ్ళి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం బానుముక్కల గ్రామంలోని 1వ అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా లేక పోవడంతో అసహనం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడం, సరుకుల నిల్వలు ఉండాల్సిన వాటికన్న ఎక్కువగా ఉండటంతో టీచర్‌కు మెమో జారీ చేశారు. వేంపెంట లోని అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు సరిగా లేక పోవడం, బానకచెర్ల గ్రామంలో టీచరు యూనిఫాం వేసుకోక పోవడంతో మెమోలు జారీ చేసినట్లు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ముత్యాలపాడులో సిబ్బందికి సూచనలు ఇస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు

చాగలమర్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణ అధికారి కామేశ్వరరావు సూచించారు. మంగళవారం ముత్యాలపాడు గ్రామంలో ఓ పాఠశాలలో మహిళకు డెంగీ లక్షణాలు ఉన్నట్లు తెలియడంతో పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డెంగీ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలను నిర్లక్ష్యం చేయరాదని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సింధూర, ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి శివచంద్రారెడ్డి, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఎన్ఎం సుభాషిణి, ఆశా వర్కర్లు, బర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

అమర గాయకుడు ఘంటసాలకు నివాళి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావుకు అభిమానులు నివాళి అర్పించారు. ఘంటసాల 51వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద శ్రీ లలిత కళా సమితి వ్యవస్థాపకుడు బిజ్జం వెంకటేశ్వరరెడ్డి, ఘంటసాల అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మంగళవారం నివాళి అర్పించారు. కార్యక్రమంలో పుల్లయ్య, లక్ష్మిరెడ్డి, సాంబశివుడు, ప్రసాద్, నరసింహారావు, రామాచారి పాల్గొన్నారు.

'బుక్ కీపర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి'

బేతంచెర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : తొలగించిన బుక్ కీపర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బేతంచెర్ల స్త్రీ శక్తి భవనం కార్యాలయం మూసివేసి సీఐటీయూ నాయకులు ఎల్లయ్య, వెంకటేశ్వర్లు, మధుశేఖర్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టారు. ఎస్ఐ రమేష్‌బాబు, ఏపీఎం మధుసూదన్‌గౌడు ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

యువతకు అవగాహన కల్పించాలి

బేతంచెర్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : యువత ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ఆంధ్రప్రదేశ్, రాయలసీమ విద్యార్థి ఫెడరేషన్ సంఘాల నాయకులు కోరారు. మంగళవారం పట్టణంలోని ఎస్ఐ కార్యాలయంలో సీఐ వెంకటేశ్వరరావు, రమేష్‌బాబులను వారు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయలసీమ రవీంద్రనాథ్, ఏపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగ సురేంద్ర యాదవ్, నాయకులు బాలకృష్ణ నాయక్, శివ, కిట్టు, పురుషోత్తం పాల్గొన్నారు.

అడవిలో కార్చిచ్చు

రుద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం రేంజ్ పరిధిలోని నల్లమల అడవిలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గుర్తు తెలియని వ్యక్తులు ధూమపానం చేసి పడేయడంతో అడవికి నిప్పంటుకుంది. అధికారులు గుర్తించి నివారణకు చర్యలు తీసుకున్నారు.

'వైసీపీ హయాంలో కార్పొరేషన్లు నిర్వీర్యం'

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ తదితర కార్పొరేషన్లు నిర్వీర్యమయ్యాయని.. వాటి నిధులను సైతం దుర్వినియోగం చేశారని టీడీపీ శిరివెళ్ల, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల కన్వీనర్లు కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, శీలం హరికుమార్‌రెడ్డి, కరిమద్దెల నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాలపై వైసీపీ నాయకుడు భూమా కిషోర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను వారు ఖండించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుసేన్ బాషా, టీడీపీ నాయకుడు అంజి తదితరులు పాల్గొన్నారు.

స్థలం విషయంలో ఘర్షణ.. కేసు నమోదు

దొర్నిపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొర్నిపాడు గ్రామానికి చెందిన పెద్ద నరసింహుడు, తోట చిన్న పాములేటి ఇరువురు అన్నదమ్ములు. స్థలం విషయంలో మంగళవారం ఘర్షణ పడగా కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రామయ్య తెలిపారు.

డిగ్రీ కళాశాలలో మెరుగైన వసతులు

శిరివెళ్ల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు యర్రగుంట్ల గంగుల తిమ్మారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి అన్నారు. కమిషనర్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారి ఉత్తర్వుల మేరకు యర్రగుంట్ల, దీబగుంట్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, శిరివెళ్ల మోడల్ స్కూల్‌లోని 192 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులకు డిగ్రీ కళాశాలలో మంగళవారం ఓపెన్ డే నిర్వహించారు. కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యాబోధన, కోర్సులు, లేబరేటరీల గురించి విద్యార్థులకు వివరించారు. డిగ్రీ కళాశాలలో రాబోయే విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు పెంచడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

పంట పొలాల పరిశీలన

రుద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం ఫారెస్టు సబ్‌డివిజనులోని చెలిమరేంజ్ పరిధిలో అడవి పందులు దాడి చేసిన పంట పొలాలను పరిశీలించినట్లు మంగళవారం పెద్దకంబలూరు సెక్షన్ ఆఫీసరు కిశోర్‌కుమార్ తెలిపారు. పంటలకు నష్టం జరిగితే పరిహారం అందిస్తామన్నారు. వన్యప్రాణులకు హానీ చేయవద్దన్నారు. శ్రీరంగాపురం, కోటకొండ గ్రామాల పరిధిలోని రైతులు సాగు చేసిన మినుము పంటను పరిశీలించామన్నారు.

మినీ గోకులాలు పూర్తి చేయండి

రుద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మినీ గోకులాలు పూర్తి చేయాలని ఏపీడీ సాంబశివరావు అన్నారు. మంగళవారం రుద్రవరంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీవో ప్రతాప్, సుబ్బన్న ఉన్నారు.

'రామ్‌కో నుంచి నష్టపరిహారం ఇప్పించండి'

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రామ్‌కో సిమెంట్ పరిశ్రమ కాలుష్యంతో పంటలను కోల్పోయామని, త్వరితగతిన నష్టపరిహారం ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కొలిమిగుండ్ల, కల్వటాల గ్రామాల రైతులు తహసీల్దారు బాలీశ్వరరెడ్డిని కలిసిన వినతి పత్రం అందజేశారు. రైతులు నాగేశ్వరరెడ్డి, గుజ్జల పెద్దయ్య పుల్లయ్య శ్రీకాంతరెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధుడికి పింఛన్ పంపిణీ

బనగానపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలాపురం గ్రామానికి చెందిన వృద్ధుడు రంగన్నకు రూ. మూడు వేలు పింఛన్ టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ మంగళవారం అందించారు. రంగన్నకు రేషన్ కార్డులేకపోవడంతో వృద్ధాప్య పింఛన్ రావడం లేదు. స్పందించిన బీసీ ఇందిరమ్మ తన సొంత నిధుల్లో నుంచి రూ.3వేలు పింఛన్ అందించారు.

వైభవంగా జంబుల పరమేశ్వరి పౌర్ణమి పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రుద్రవరం సమీపంలో కొలువుదీరిన జంబుల పరమేశ్వరి అమ్మవారికి మంగళవారం పౌర్ణమి పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. కడప, ప్రొద్దుటూరు, నంద్యాల, జమ్మలమడుగు, రుద్రవరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

డోన్‌లో ఆధ్యాత్మిక శోభ

- పట్టణంలో నూతన షిరిడీ సాయిబాబా మందిర నిర్మాణం
- 13న సాయిబాబా విగ్రహం ప్రాణప్రతిష్ఠ వేడుకలు
- రాష్ట్ర మంత్రులు రాక

డోన్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో ఆధ్యాత్మిక శోభ వెలువిరుస్తుంది. పట్టణ సమీపంలో జాతీయ రహదారి వద్ద షిరిడీ సాయిబాబా మందిరం నిర్మాణం పూర్తి చేసుకుని డోన్‌కే తలమానికంగా నిలుస్తోంది. ఈ నెల 13న సాయిబాబా మందిరం విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు.



సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్న ప్రదేశం

వేడుకలకు రాష్ట్ర మంత్రులు రాక

రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్, ఎన్ఎండీ ఫరూక్, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు హాజరు కానున్నారు. రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సాయిబాబా మందిరం కమిటీ సభ్యులు భాష్యం వెంకటరమణగౌడు, చాటకొండ శ్రీనివాసులు, కందుకూరి పార్థసారథి, కొండా సురేష్, న్యాయవాది ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు ఇప్పటికే ఆహ్వానపత్రికలు అందజేశారు. 13న వైభవంగా జరిగే విగ్రహ ప్రతిష్ఠకు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పట్టణంలో రూరల్ పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.



విద్యుద్దీపాలంకరణలో షిరిడీ సాయిబాబా మందిరం

మానసిక ప్రశాంతత



పట్టణ సమీపంలో షిరిడీ సాయిబాబా మందిరం ఏర్పాటుతో భక్తులకు మందిర ప్రదేశం మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. సాయిబాబా ఆలయంలో ధ్యాన మందిరాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం సంతోషకరం. భక్తులు సాయిబాబాను స్మరించుకుంటూ ధ్యానం చేయడానికి మంచి అనుకూల వాతావరణం ఉంది.

- తనూజ, భక్తురాలు, రాహుల్‌గాంధీ నగర్, డోన్

నాటి ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ చొరవతో ..



2005లో అప్పటి ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ సహకారంతో షిరిడీ సాయిబాబా మందిరం నిర్మాణానికి దాతల సహకారంతో స్థల సేకరించారు. 2016లో సాయిబాబా మందిరం కమిటీ గౌరవాధ్యక్షుడిగా కేఈ ప్రతాప్, అధ్యక్షుడిగా ప్రస్తుత రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, సభ్యులు దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చూడాలి

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్టుహౌస్ సమావేశ భవనంలో నియోజకవర్గ అధికారులతో ఎమ్మెల్యే కోట్ల సమావేశం నిర్వహించారు. తాగునీటి సమస్యపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో నీటి కొరత సంబంధించిన ఫిర్యాదులు వస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఫారెస్టు, రెవెన్యూ, హైవే అథారిటీ, మెగా ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆయన తాగునీటి సంబందించిన పైపులైన్ పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. పనుల్లో జాప్యం వస్తే సహించేది లేదన్నారు. పనుల్లో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

వాటర్ గ్రిడ్ పైపులైన్ పనులు ఎంత వరకు పూర్తయ్యాయి?

బేతంచెర్ల : గోరుకల్లు రిజర్వాయర్ నుంచి మెగా వాటర్ గ్రిడ్ పైపలైన్ ద్వారా చేపట్టిన పనులు ఎంత వరకు పూర్తయ్యాయని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మండలంలోని ఆర్.కొత్తపల్లి, రంగాపురం, హెచ్.కొట్టాల గ్రామాల్లో ఆయన అధికారులతో చర్చించారు. అలాగే నేషనల్ హైవే అథారిటీస్ అభ్యంతరాల గురించి ఆరా తీశారు.

ప్రత్యేక గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలి

డోన్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ప్రవేశ పెట్టిన రైతు ప్రత్యేక గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని డోన్ వ్యవసాయ ఏడీఏ అశోక్‌వర్ధన్ రెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని వ్యవసాయ కార్యాలయంలో రైతుసేవా వ్యవసాయ సహాయకులతో సమావేశమయ్యారు. రైతులు ప్రత్యేక గుర్తింపు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ సహాయ సిబ్బందికి సూచించారు. డోన్ సబ్ డివిజన్ పరిధిలో 43వేల మంది రైతులు ఉన్నారన్నారు. 43వేల మంది రైతులు గుర్తింపుసంఖ్య నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక గుర్తింపు చేసుకున్న రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలకు అర్హులు అవుతారన్నారు. సమావేశంలో వ్యవసాయాధికారి అబ్దుల్‌షఫీ, సహాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ అశోక్ వర్ధన్‌రెడ్డి

నిమ్మసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి

బనగానపల్లె, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): నిమ్మసాగులో సస్య రక్షణ చర్యలు చేపట్టాలని యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ ధనలక్ష్మి కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ పెట్టుబడులు తగ్గించుకొని కుటుంబం ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు.

చీనీ నిమ్మ తోటల్లో రైతులు ఎదుర్కొంటున్న వేరుకుళ్లు, పోషక లోపాల నివారణపై శాస్త్రీయ పద్ధతులను అవలంభించి పరిష్కరించుకోవాలన్నారు. సరైన సమయంలో ఎరువు నీటి యాజమాన్యం పద్ధతులు చేపట్టాలని కోరారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ ఆదినారాయణ మాట్లాడుతూ నిమ్మలో అనువైన రకాలు, చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులు పూత పిందె రావడానికి, కొమ్మ కత్తిరింపుపై రైతులకు అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త బాలరాజు, రమణయ్య మాట్లాడుతూ నిమ్మలో చీడపీడలైన గజ్జి తెగులు, వేరుకుళ్లు, రసం పీల్చే పురుగుల సమస్య సస్యరక్షణపై కల్పించారు. నిమ్మలో బోరాన్, జింకు లోపం లక్షణాలు యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు మట్టి పరీక్షలు నిర్వహించుకోవాలని కోరారు. పంటలు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతులతో చర్చ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ, మద్రిపల్లె, కోటకందుకూరు రైతులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి: రిటైర్డ్ ఐజీ

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని రిటైర్డ్ ఐజీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం మండలంలోని పేట్నీకోట, కొలిమిగుండ్ల జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహించారు. ప్రతి విద్యార్థి కష్టపడి, క్రమ శిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. పెట్నీకోట పాఠశాలకు రూ.20వేలు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంఈవో అబ్దుల్‌కలాం, హెచ్ఎంలు హుసేనయ్య, సుధాకరగుప్త, ఉపాధ్యాయులు రమణయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పెట్నీకోట ఉపాధ్యాయులతో విశ్రాంత ఐజీ మహమ్మద్ ఇక్బాల్

విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

అవుకు : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని రిటైర్డ్ ఐజీ, మాజీ ఎమ్మెల్సీ షేక్ ఇక్బాల్‌హుశేన్ అన్నారు. మంగళవారం అవుకు పట్టణంలోని జడ్పీ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలను ఎస్ఐ రాజారెడ్డితో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత ప్రమాణాలతో విద్యను అందిస్తున్నారని అన్నారు. బాలురు, బాలికలకు క్రీడా సామగ్రిని అందజేశారు. సొంత నిధులతో క్రీడా మైదానం పెరిగి ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి అందుబాటులోకి తెస్తామన్నారు. బాలికల పాఠశాల ప్రహరీ ఎత్తును పెంచుతామన్నారు. ప్రభుత్వ పాఠశాలలకు కావలసిన సౌకర్యాల కల్పనకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీధర్‌రావు, ప్రధానోపాధ్యాయులు శింగయ్య, చెన్నకేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ఘనంగా సాయిబాబా విగ్రహం ఊరేగింపు

డోన్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పట్టణంలో సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు. ఉత్సవ విగ్రహం ముందు భక్తులు కోలాటాల నృత్యాలు చేస్తూ, బాణాసంచా కాల్చి భక్తులు భక్తిపారవశ్యంతో తన్మయం చెందారు. పట్టణంలోని కొత్తబస్టాండు, పాతబస్టాండు ప్రాంతం మీదుగా షిరిడీ సాయిబాబా విగ్రహ ఊరేగింపు కన్నుల పండువగా సాగింది. రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, కమిటీ సభ్యులు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మురళికృష్ణగౌడు, సభ్యులు చాటకొండ శ్రీనివాసులు, కొండా సురేష్, పార్థసారథి, ఆలా మల్లికార్జున రెడ్డి, శ్రీరాములు, భక్తులు పాల్గొన్నారు.



షిరిడీ సాయిమందిరంలో ప్రత్యేక హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు



స్వామివారి విగ్రహం ఊరేగింపు

సాయి నామస్మరణతో మార్మోగిన డోన్

డోన్ పట్టణ సమీపంలో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా జరుగుతున్న విశేష పూజలతో సాయిస్మరణలతో డోన్ మార్మోగుతుంది. షిరిడీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక హోమాలు, గణపతిపూజ, రుద్రహోమాలు వంటి కార్యక్రమాలు పురోహితులు, వేదపండితుల ఆధ్వర్యంలో సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజల్లో భక్తులు తరలివచ్చి తరించారు. భక్తులకు షిరిడీ సాయిబాబా మందిరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా కాశినాయన జయంతి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందిపాడు గ్రామ సమీపంలో వెలసిన కాశినాయన స్వామి ఆలయంలో మంగళవారం జయంతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మరోవైపు పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

15 నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోరుమానుపల్లె గ్రామంలో బుగ్గ రామలింగేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠోత్సవాలు ఈనెల 15నుంచి 17వరకు కొనసాగుతాయని నిర్వాహకులు మంగళవారం వెల్లడించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠతో పాటు, దేవతాహోమములు, కలశ ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, రుద్రాభిషేకము, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.

పంట మార్పిడి తప్పనిసరి

దొర్నిపాడు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రతి ఏడాది పంట మార్పిడి చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ఇంజనీర్ ఓబులేసు అన్నారు. మంగళవారం మండలంలోని దొర్నిపాడు గ్రామంలో ఏవో ప్రమీల ఆధ్వర్యంలో శనగ పంట కోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్‌వో రామిరెడ్డి, వీఆర్వో, వీఆర్ఏలు ఉన్నారు.

నేడు, రేపు నీటి సరఫరాకు అంతరాయం

డోన్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణంలో బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈదులదేవరబండ, బండగుట్ట మధ్యలో ఈదుల దేవరబండ-కోటకొండ, సంఘాల, ఆగవేలి గ్రామాల మధ్య పైపు లీకేజీ వలన పట్టణ ప్రజలకు రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, మరలా 14న ఉదయం నీటి సరఫరా యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు.

దరఖాస్తులు చేసుకోండి

డోన్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం సమీపంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏఆర్ సుస్మిత మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి ఇంగ్లీష్ మీడియం, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు వచ్చే నెల 6వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మెరిట్‌ను బట్టి ప్రవేశాలు ఉంటాయన్నారు.

డోన్ డిప్యూటీ డీఈవోగా వెంకట్రామిరెడ్డి

డోన్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): డోన్ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారిగా ఎస్.వెంకట్రామిరెడ్డి ఇన్‌చార్జిగా నియామకమయ్యారు. ఇక్కడ పని చేస్తున్న డిప్యూటీ డీఈవో సుధాకర్ రెడ్డి నంద్యాలలోని డీఈవో కార్యాలయానికి ఏడీఏగా బదిలీ అయ్యారు. కోవెలకుంట్లలో ఎంఈవో-1గా పని చేస్తున్న వెంకట్రామిరెడ్డిని డోన్ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఎఫ్ఏసీగా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. ఆయన రెండు రోజుల్లో బాధ్యతలు తీసుకుంటున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.



డిప్యూటీ డీఈవోగా వెంకట్రామిరెడ్డి

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

డోన్ టౌన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కటా విభాగంలో పట్టణంలోని నారాయణ పాఠశాల విద్యార్థి పీయూష్ రెడ్డి బ్రౌంజ్ మెడల్ సాధించాడని పాఠశాల ప్రిన్సిపాల్ నాగరాజు, కరాటే మాస్టర్ రమణ తెలిపారు. అలాగే సాత్విరెడ్డి, తన్విరెడ్డి, అభినయ, ద్రాక్షాయని, లౌక్యరెడ్డి, మనోజ్ఞ, హేమర్, హిమతేజ్, అభిరామ్, భానుప్రకాష్, బాలాజీ పలు బ్రౌంజ్, సిల్వర్, గోల్డ్ మెడల్స్ సాధించారు. విద్యార్థులకు ప్రిన్సిపాల్ నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ శకుంతల, డీన్ రవీ, ఈరన్న, సుధారాణి అభినందనలు తెలిపారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈవో అనూరాధ సూచించారు. మంగళవారం మండలంలోని చిన్నబోధనం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. సంబంధిత రికార్డులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని, నాణ్యతగల కోడిగుడ్లు ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం మురళీ మనోహర్‌రెడ్డి, సీఆర్పీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాలల యుద్ధగర్జనను జయప్రదం చేయండి

చాగలమర్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలో ఈనెల 23న నిర్వహించనున్న మాలల యుద్ధగర్జన సభను జయప్రదం చేయాలని ఆ సంఘ నాయకులు కె.ప్రసాద్, ప్రభుకాంత్, డి.ప్రసాద్ కోరారు. మంగళవారం ముత్యాలపాడు బస్టాండు సమీపంలో మాలల యుద్ధగర్జన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో మాలల సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే వేగవంతం

చాగలమర్రి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా సచివాలయాల పరిధిలో దివ్యాంగుల గుర్తింపు ఇంటింటా సర్వేను వేగవంతం చేయాలని హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్‌వైజర్ రామలింగారెడ్డి తెలిపారు. మంగళవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఏఎన్ఎంలు, ఆశావర్కర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుకండి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోవెలకుంట్ల పట్టణంలోని ఆర్టీసీ డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కోవెలకుంట్ల డిపోలో మేనేజరు తిరుపతయ్య ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 20 మంది కండక్టర్లు, డ్రైవర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీసిబ్బంది పాల్గొన్నారు.

మూడు నీటికుంటలు ఏర్పాటు

రుద్రవరం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో ఉంచుకుని వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు మూడు నీటి కుంటలు తవ్వించామని రేంజర్ శ్రీపతినాయుడు మంగళవారం రుద్రవరం రేంజ్‌లో అహోబిళం నార్త్, సౌత్ ఇంకా ఉపలు ప్రాంతాల్లో అడవిని పరిశీలించారు. కార్యక్రమంలో ఫారెస్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి స్థలాల గుర్తింపునకు ప్రత్యేక టీములు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటి స్థలాల గుర్తింపునకు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ స్థలాలు, జగనన్న లేఅవుట్‌లలో ఇప్పటి వరకు నిర్మాణాలు చేపట్టని వాటిని గుర్తించి నివేదికలు తయారు చేస్తామన్నారు. ఇది వరకు కేటాయించిన స్థలాల్లో ఇళ్ల నిర్మించుకోని వారి నుంచి వివరణ తీసుకుంటామన్నారు.

మరమ్మతులు చేయించండి

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్యలు రాకుండా చేతి పంపులకు మరమ్మతులు చేయించండని ఎంపీడీవో ఉమమహేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయా గ్రామాల కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంటులతో ఆయన సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రణీత్‌క్రిష్ణ, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరావు తదితరులున్నారు.